పోలీస్ స్టేషన్‌లో డిఎస్‌పి ఆకస్మిక తనిఖీలు

ప్రజాశక్తి - రామకుప్పం: రామకుప్పం పోలీస్ స్టేషన్‌ను కుప్పం డివిజన్ డిఎస్‌పి శ్రీనాథ్ గురువారం సాయంత్రం సందర్శించారు. ఈ సందర్భంగా డిఎస్పీ రానున్న సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి సిబ్బందికి పలు సూచనలు సలహాలు తెలియజేశారు. పెండింగ్‌లో ఉన్న అరెస్టు కేసులను సమీక్షించారు. అక్రమ రవాణా అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎస్‌ఐ శివకుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

పాడి రైతుకు న్యాయం జరిగేనా..?

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్

పాలసేకరణలో మోసాలను అరికట్టేలా దేశంలో తొలిసారిగా ఆంధ్రప్రదేశ్‌లో పాలసేకరణ (రైతు సంరక్షణ) నాణ్యమైన పాల వినియోగ చట్టం 2023 రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చింది. పాల వినియోగ చట్టం ప్రకారం జిల్లాలో ప్రైవేట్, ప్రభుత్వ పాల డెయిరీల క్షేత్రస్థాయిలో పాడి రైతుల నుండి పాలు సేకరిస్తున్న మిల్క్ ఎనలైజర్స్ తప్పనిసరిగా ఏడాదికి రూ.1000లు చెల్లించి పొందాలి. ఏడాదికోసారి లైసెన్సులు రెన్యూవల్ చేసుకోవాలి. మిల్క్ ఎనలైజర్స్ తయారీ కంపెనీలు , డీలర్లు రెండేళ్ళకో సారి రూ.2 లక్షలు చెల్లించి మిల్క్ కమిషనర్ ద్వారా లైసెన్సులు పొందాలి. పాల వినియోగ చట్టం 2023 అమలు చేసేందుకు రాష్ట్రస్థాయి నుండి జిల్లా స్థాయి వరకు పశుసంవర్థశాఖ అధికార్లను పర్యవేక్షులు వ్యవహరిస్తారు.

ఈచట్టం ప్రకారం మిల్క్ ఇన్‌స్పెక్టర్లు పాలసేకరణ కేంద్రాలు, డెయిరీలను క్రమం తప్పకుడా తనిఖీలు నిర్వహించి పాల సేకరణ, విక్రయాల్లో మోసాలకు పాల్పడితే జరిమానాలు, లైసెన్సులు రద్దు చేసే అధికారముంటుంది. పాడి రైతులు డెయిరీల మోసాల నుండీ రక్షించేలా ఈ చట్టం తీసుకొచ్చినట్లు ప్రభుత్వం చెబుతోంది. పాలను సేకరిస్తున్న ప్రయివేటు డెయిరీలు మిల్క్ ఎనలైజర్స్ ద్వారా పాలలోని వెన్న శాతం, ఎస్ఎన్ఎఫ్ ఆధారం లీటరు ధరను నిర్ణయిస్తాయి. ఏ రోజుకా రోజు పాడి రైతుల పోసిన పాలలో వెన్నశాతం ఎస్ఎన్ఎఫ్ శాతం ఎంత ఉందో అప్పటికప్పడే తెలియజేస్తారు. దీన్ని బట్టి ధర నిర్ణయించబడుతుంది. కొన్ని ప్రయివేటు డెయిరీలు వెన్నశాతం, ఎస్ఎన్ఎఫ్ శాతం తక్కువ చూపుతూ పాడి రైతులను దోపిడీ చేస్తున్నారనే ఆరోపణలున్నాయి. మరో వైపు వినియోగదార్లకు ప్యాకెట్ల రూపంలో అందించే పాలలో ఏమాత్రం పోషకాలుండటం లేదనే ఆరోపనులున్నాయి. ప్రభుత్వం తీసుకొస్తున్న పాల వినియోగ చట్టం ద్వారా పాడి రైతులకు, వినియోగదార్లకు మేలు జరుగుతుందని ఆశిద్దాం...

చిత్తూరు జిల్లాలో రోజుకు 19లక్షల లీటర్ల పాల ఉత్పత్తి జరుగుతోంది. స్థానికంగా రెండు లక్షల లీటర్ల పాలు బహిరంగ మార్కెట్‌లో (పాకెట్ల) రూపంలో కాకుండా నేరుగా పాడిరైతు నుండి కొనుగోలు చేసి మార్కెట్‌లో అమ్మకాలు, ఆర్గనైజ్డ్ డెయిరీల ద్వారా 4 లక్షల లీటర్లు, ప్రయివేటు డెయిరీల ద్వారా 12లక్షల లీటర్లు సేకరిస్తున్నాయి. మిగిలిన పాలు వివిధ రూపాల్లో మార్కెట్‌లోకి వస్తున్నాయి. పాలసేకరణలో జరిగే మోసాలకు అడ్డుకట్ట వేసేందుకు తూనికలు- కొలత చట్టం ప్రకారం తనిఖీ చేసి స్థానిక పశు వైద్యులను అప్పగించాలి. అయితే చట్టపరంగా మిల్క్ ఎనలైజర్స్ (పాలు సేకరించేవారు)పై చర్యలు తీసుకొనేలా ఎలాంటి చట్టం లేకపోవడంతో ప్రభుత్వం పాల వినియోగచట్టం అమల్లోకి తీసుకొచ్చింది.

చట్టం అమలు బాధ్యత వీరిదే..

చట్టం అమలు, పర్యవేక్షణ బాధ్యత రాష్ట్రస్థాయిలో మిల్క్ కమిషనర్, జిల్లాస్థాయిలో పశుసంవర్థకశాఖ ఏడి, మిల్క్ ఇన్‌స్పెక్టర్లుగా వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్స్, ఏవిహెచ్ అసిస్టెంట్ డైరెక్టర్లు వ్యవహరిస్తారు. వీరు చట్టప్రకారం మిల్క్ ఎనలైజర్స్‌తో పాలు, పాలసేకరణ కేంద్రాలు, బల్క్‌మిల్క్ కూలింగ్ యూనిట్లు, ఆటోమేటిక్ మిల్క్ కలెక్షన్ యూనిట్లు పనిచేసేలా పర్యవేక్షిస్తారు. పాల నాణ్యత పాటించకపోతే ఫుడ్ సేఫ్టీ, నాణ్యతా ప్రమాణాల యాక్టు 2006 ప్రకారం చర్యలు తీసుకుంటారు. పాలల్లోఫ్యాట్, ఎస్ఎన్ఎఫ్ శాతాన్ని బట్టీ నిర్ధేశించిన రేటు చార్ట్ ప్రకారం పాడి రైతుకు మద్దతు ధర దక్కేలా పర్యవేక్షిస్తారు. ఇందు కోసం సాఫ్ట్‌వేర్ అప్లికేషన్‌ను అభివృద్ధి చేస్తున్నారు.

లైసెన్సులు తప్పనిసరి..

మిల్క్ ఎనలైజర్స్ ఉన్న వారు రూ.1000లు చెల్లించి సంబంధి ఆథరైజ్డ్ అధికారి నుండి లైసెన్స్ ఈ మార్చి 10వ తేదీలోపు పొందాలి. ఏటా లైసెన్స్ రెన్యూవల్ చేసుకోవాలి. మిల్క్ ఎనలైజర్స్ తయారీ దారులు, డీలర్లు ప్రతి రెండేళ్ళకోసారి రూ.2 లక్షలు చెల్లించి మిల్క్ కమిషనర్ ద్వారా లైసెన్సు పొంది వారి పరిధిలోని మిల్క్ ఇన్‌స్పెక్టర్ వద్ద రూ.500లు చెల్లించి కనీసం ఏడాది పాటు చెల్లుబాటు అయ్యేలా వెరిఫికేషన్ సర్టిఫికెట్ పొందాల్సి ఉంటుంది. మిల్క్ ఎనలైజర్ లైసెన్స్ వెరిఫికేషన్ సర్టిఫికెట్‌ను పాలసేకరణ కేంద్రంలో ప్రదర్శించాలి.

క్రమం తప్పకుండా తనిఖీలు

పాల వినియోగ చట్టం ప్రకారం మిల్క్ ఇన్‌స్పెక్టర్లు పాలసేకరణ కేంద్రాలు, డెయిరీల్లో క్రమం త్పకుండా తనిఖీలు నిర్వహించాలి. తేడా ఉన్నట్లుగా గుర్తిస్తే జరిమానా, లైసెన్సు రద్దు, కేసుల నమోదు వంటి చర్యలు తీసుకోవాలి. కల్తీ జరిగినట్లు గురిస్తే తగిన చర్యల కోసం ఆహార భద్రత అధికారికి సమాచారం ఇవ్వాలి. మిల్క్ యూనియన్, డెయిరీ నిర్ధారించిన రేటు ప్రకారం పాలు పోసే వారికి పాలసేకరణ ధర చెల్లిస్తున్నదీ లేనిదీ కూడా పరిశీలించాలి. జిల్లాస్థాయిలో ఆథరైజ్డ్ అధికారిగా వ్యవహరించే అధికారులు, మిల్క్ ఇన్‌స్పెక్టర్ల పనితీరును ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలి. పాడి రైతు, వినియోగదార్లకు మోసం జరిగినట్లు గుర్తిస్తే ఏ పాల డెయిరీ పరిధిలో మోసం జరిగిందో గుర్తించి యూనిట్‌ను సీజ్ చేయాలి, శిక్షార్హమైన నేరాలకు పాల్పడితే చట్టపరంగా జరిమానాలు, జైలు శిక్ష కూడా విధించవచ్చు.

మార్చి 10 లోపు లైసెన్సులు పొందాలి

- ప్రభాకర్, జిల్లా పశు సంవర్థశాఖ సంచాలకులు

పాల వినియోగ చట్టం ప్రకారం జిల్లాలోని ఎనలైజర్స్ మార్చి 10వ తేదీలోపు లైసెన్సులు పొందాలి. చిత్తూరు జిల్లాలోని 31 మండలాల్లో 25 పాల డెయిరీలున్నాయి. 5వేల ఎనలైజర్స్ (పాలు సేకరించేవారు) ఉన్నారు. పాలసేకరణ, వినియోగంలో మోసాలను అరికట్టేలా ప్రభుత్వం ఈ చట్టం తీసుకురావడం జరిగింది. సాధారణంగా 3.5 శాతం ఫ్యాట్, 8 శాతం ఎస్ఎన్ఎఫ్ పాలలో ఉండాలి. దేశంలోనే ఏపిలో మొట్టమొదటగా ఈ చట్టం అమల్లోకి తీసుకురావడం జరిగింది. ఈ చట్టం ద్వారా పాడి రైతు మోసాలను అరికట్టడంతో పాటు, వినియోగదార్లకు పోషకాలతో కూడిన పాలు అందించే అవకాశముంది.

చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలి

–ఓబుల్‌రాజు, జిల్లా కార్యదర్శి, ఏపీ రైతు సంఘం

ప్రభుత్వం తీసుకొచ్చిన చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయడం వల్ల పాడిరైతు, వినియోగదార్లకు ప్రయోజనమే. డెయిరీ మోసాలను అరికట్టడం కాదు ప్రయివేటు డెయిల నుండీ పాడి రైతుకు గిట్టుబాటు ధర కల్పించాలి. మరో వైపు ప్రస్తుతం ఈ చట్టం అమలుపై ప్రభుత్వం ఆసక్తి చూపడం చూస్తే అమూల్ డెయిరీ ప్రయోజనం కోసమేనా అనే అనుమానాలు కలుగుతున్నాయి. చిన్నచిన్న డెయిరీలు, బల్క్‌మిల్క్ యూనిట్లను దెబ్బతీసీ అమూల్‌కు ప్రయోజనం చేకూర్చకుండా పాడిరైతు, వినియోగదార్ల సంక్షేమాన్ని ఆలోచించి రూపొందిన చట్టాన్ని ఆ ప్రయోజనం జరిగేలా అమలు చేయాలి.

అక్రమంగా తొలగించిన అంగన్వాడీలను విధుల్లోకి తీసుకోవాలి

హైకోర్టులో సిఐటియు విజయం

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: కుప్పం ఐసిడిఎస్ ప్రాజెక్టులో అక్రమంగా గత అక్టోబర్‌లో ఇద్దరిని టెర్మినేషన్ చేయడంతో సీఐటీయూ ఆధ్వర్యంలో అంగన్వాడీలు కోర్టుకు వెళ్లడం జరిగింది. బుధవారం హైకోర్టు తొలగించిన అంగన్వాడీల వెంటనే విధుల్లోకి తీసుకోవాలని తీర్పును ఇచ్చింది. కోర్టు తీర్పును వెంటనే అమలు చేయాలని గురువారం జిల్లా కలెక్టర్‌కి, ఐసిడిఎస్ పిడికి సిఐటియు ఆధ్వర్యంలో వినతిపత్రం ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా ఏపీ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షుడు వాడ గంగరాజు, యూనియన్ జిల్లా అధ్యక్షురాలు కెపి.లలితలు మాట్లాడుతూ కుప్పం అంగన్వాడీల సమస్యలపై పోరాటం చేసినందుకు ఐసిడిఎస్, సిడిపిఓ రాజకీయకక్షతో ప్రమీల, కవితలను అక్రమంగా తొలగించడం దారుణమని, న్యాయం ఎప్పుడైనా గెలుస్తుందని తెలిపారు. ఇద్దరిని తొలగించడమే కాకుండా 70మందికి వేతనాల కోత విధించడం జరిగిందని సిడిపిఓ తగిన మూల్యం చెల్లించాల్సి ఉంటుందని హెచ్చరించారు. అక్రమంగా తొలగించిన వారిని వారం రోజుల్లోపు వెంటనే విధుల్లోకి తీసుకోవాలని, అధికారులు ఇచ్చిన టెర్మినేషన్ను కోర్టు డిస్మిస్ చేసిందని తెలిపారు. కోర్టు ఆర్డర్ కాపీలను జిల్లా కలెక్టర్‌కి ఐసిడిఎస్ పిడిలకు ఇవ్వడం జరిగిందని, అధికారులు వెంటనే స్పందించి కోర్టు ఆర్డర్లను అమలు చేయాలని కోరారు. జిల్లాలో అంగన్వాడీలందర్నీ ఇదేవిధంగా తొలగిస్తామని బెదిరింపులకు పాల్పడిన అధికారులకు కోర్టు తగిన బుద్ధి చెప్పిందని తెలిపారు. అంగన్వాడీలు ఐక్యంగా ప్రతి సమస్యను పోరాడి సాధించుకోవాలని వారు పిలుపునిచ్చారు. అధికారులు చట్టవిరుద్ధంగా వ్యవహరించకుండా చట్టానికి లోబడి పనిచేయాలని తెలిపారు. లేకపోతే చట్టం తన పని తాను చేసుకుపోతుందని గుర్తు చేశారు. కష్టపడి పనిచేస్తున్న కార్మికులపై కక్ష సాధింపు చర్యలు మానుకోవాలని డిమాండ్ చేశారు. అధికారులు ఇప్పటికైనా తప్పుడు పద్ధతులు ఆలోచించకుండా కోర్టు ఇచ్చిన ఆర్డర్ ప్రకారం వారిని వెంటనే విధుల్లోకి తీసుకొని వారికి న్యాయం చేయాలని లేనిపక్షంలో మరోసారి పోరాటం చేయాల్సి వస్తుందని హెచ్చరించారు. తొలగించబడ్డ ప్రమీల, కవితలు, అంగన్వాడీలు పాల్గొన్నారు.

రేపు జిఎస్ఎల్వి ఎఫ్ 14 ప్రయోగానికి సిద్ధం...

ప్రజాశక్తి-సూళ్లూరుపేట: శ్రీహరికోట నుంచి ఈనెల 17న శనివారం సాయంత్రం 5.30 గంటలకు జి ఎస్ ఎల్ వి 14 ప్రయోగానికి శాస్త్రవేత్తలు సిద్ధమయ్యారు. ఈ రాకెట్ ద్వారా భారత వాతావరణ ఉపగ్రహం ఇన్ శాట్ 3డిఎస్ ను ప్రయోగిస్తున్నారు. షార్ లోని రెండవ వేదిక వద్ద ఇప్పటికే రాకెట్ ప్రయోగానికి సంబంధించి తుది ఏర్పాట్లు జోరందుకున్నాయి .ఇస్రో కీర్తి కిరీటంలో ఈ ఉపగ్రహం మరో కీలకమైన ప్రయోగంగా భావిస్తున్నారు. ఇప్పటికే పలు ఇన్సాట్ తరహా ఉపగ్రహాలను ఇస్రో ప్రయోగించి ఉంది. ఎప్పటికప్పుడు వాతావరణంలో జరిగే మార్పులు గమనించి భూ కేంద్రాలకు ఖచ్చితమైన సమాచారం అందించడానికి కేంద్రం ప్రభుత్వ ఎర్త్ సైన్సెస్ శాఖ కోసం ఈ ప్రయోగాన్ని జరుపుతున్నారు. వాతావరణ సంబంధమైన అంశాలను అధ్యయనం చేసేందుకు ప్రయోగిస్తున్న ఈ ఉపగ్రహం బరువు 2275 కేజీలుగా ఉంది. పీఎస్ఎల్వీ రాకెట్ ను నాలుగు దశల్లో ప్రయోగిస్తే జిఎస్ఎల్వీని మూడు దశలోనే ప్రయోగించనున్నారు. 51.7 మీటర్ల పొడవైన జి ఎస్ ఎల్ వి ఎఫ్ 14 రాకెట్ ప్రయోగ సమయంలో 420 టన్నుల బరువుతో భూమి నుంచి నింగికి బయలుదేరుతుంది. వాతావరణం అంచనాలు, విపత్తులను ముందుగా హెచ్చరించడానికి ఇది ఉపయోగపడుతుంది. జి ఎస్ ఎల్ వి మార్కు2 సిరీస్ లో ఇది 16వ ప్రయోగం కావడం విశేషం.

సందర్శనకు వెళ్లి ఎన్‌క్లోజర్‌లో పడిన..

రాజస్థాన్ యువకునిపై సింహం దాడి

- వెంటాడి చంపిన దొంగలపూర్ సింహం
- జూపార్కు సందర్శకుల్లో భయభ్రాంతులు

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం)

తిరుపతి శ్రీవెంకటేశ్వర జంతు ప్రదర్శన శాలలో సింహం దాడిలో వ్యక్తి దుర్మరణం చెందిన సంఘటన గురువారం సంచలనం కలిగించింది. రాజస్థాన్ రాష్ట్రం బన్సూర్ ఆల్వార్ జిల్లా తురానా గ్రామానికి చెందిన ప్రహ్లాద్ గుర్జార్ (38) జూ పార్కు సందర్శనకు మధ్యాహ్నం లోపలికి ప్రవేశించాడు. సందర్శకులతో కలిసి ఒంటరిగానే సింహాలు ఉన్న ప్రాంతానికి వెళ్లాడు. సింహాలు ఉన్న ప్రాంతానికి జూ అధికారులు రెండు ప్రధాన గేట్లను ఏర్పాటు చేశారు. ప్రధాన గేటు పది అడుగుల ఎత్తు ఉండగా, ఎన్ క్లోజర్ గేటు 12 అడుగులు ఉంటుందని అధికారులు తెలిపారు. ప్రహ్లాద్ గుర్జార్ ప్రధాన గేటు దాటుకొని 12 అడుగులు ఎత్తుగల ఎన్ క్లోజర్ గేటు పైకి ఎక్కి ఒక్కసారిగా లోపలికి దూకేశాడు. ఎన్ క్లోజర్ లోపలికి దూకిన ప్రహ్లాద్ గుర్జార్ ను గమనించిన దొంగల్ పూర్ అనే మగ సింహం ఒక్కసారిగా దాడికి ఎగబడింది. ఈ హఠాత్ పరిణామంతో సందర్శకులు, సిబ్బంది గట్టిగా కేకలు వేయడంతో సింహం ప్రహ్లాద్ గుర్జార్ ను ఈడ్చుకుంటూ వెళ్లి దాడికి తెగబడింది. ప్రహ్లాద్ గుర్జార్ సింహం నుండి బయటపడడానికి చెట్టు మీదకు ఎక్కే ప్రయత్నం చేసినా ఫలితం లేకుండా పోయింది. సింహం అతని ఛాతి భాగంలో గట్టిగా కొరకడంతో ప్రాణాలు విడిచినట్టుగా తెలుస్తోంది. ఈ సంఘటనపై జూ సిబ్బంది తిరుపతి రూరల్ పోలీసులకు సమాచారం అందించారు. ఘటనస్థలిని పరిశీలించిన రూరల్ డిఎస్పి శరత్ రాజ్ కుమార్ కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. ప్రహ్లాద్ గుర్జార్ మతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తిరుపతి రుయా ఆస్పత్రికి తరలించారు. క్రూరమృగాలు ఉండే బోన్ల వద్ద కనీసం సిసి కెమెరాలు లేకపోవడంతో అసలేం జరిగింది? అనేది అంతుచిక్కకుండా పోయింది. మతిస్థిమితం లేక దూకాడా? లేక ఏమైనా సెల్ఫీ కోసం ప్రయత్నించాడా? అసలు తిరుపతికి ఎందుకొచ్చాడు అనే వివరాలు విచారణలో తెలియాల్సి ఉంది.

ప్రహ్లాద్ గుర్జార్ మృతదేహం

హౌసింగ్ బిల్లులు చెల్లించండి..!

మండల సమావేశంలో సభ్యుల అసంతృప్తి

ప్రజాశక్తి - రామకుప్పం: మండలంలో ఇళ్ల నిర్మాణాలశాఖపై సర్పంచులు, ఎంపీటీసీలు అసంతృప్తి వ్యక్తం చేశారు. పేదలకు ప్రభుత్వం అందించే సిమెంట్, బిల్లులు సకాలంలో అందించాలని కోరారు. గురువారం ఎంపీపీ సుబ్రహ్మణ్యం అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇళ్ల నిర్మాణాలు చేపడుతున్న లబ్ధిదారులకు సిమెంటు, పెండింగ్‌లో ఉన్న బిల్లులను సకాలంలో అందించడంలో సంబంధిత అధికారులు అలసత్వం వహిస్తున్నారని సభ్యులు సభ దృష్టికి తీసుకొచ్చారు. గతంలో ట్యాంకర్ల ద్వారా తాగునీరు సరఫరా బిల్లులు మూడు కోట్ల 70 లక్షల రూపాయల నిధులను బ్యాంకుఖాతాల్లో జమవు తోందన్నారు. గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమంలో భాగంగా మూడు కోట్ల 20 లక్షలు నిధులు మంజూరైన అన్నారు. దీంతో గ్రామాల్లో సిసిరోడ్లు, వీధిదీపాలు, డ్రైనేజీలు తదితర మూలిక వసతులు కల్పించామన్నారు. ఎమ్మెల్సీ భరత్ మాట్లాడుతూ.. త్వరలో కుప్పం నియోజకవర్గానికి ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి విచ్చేస్తున్న సందర్భంగా ఆయన పర్యటనను విజయవంతం చేయాలని కోరారు. జడ్పిటిసి నితిన్ రెడ్డి, మండల కన్వీనర్ బాబురెడ్డి, కో కన్వీనర్ చంద్రారెడ్డి, సర్పంచులు మురళి, రాజగోపాల్, ఎంపీటీసీలు మంజునాథ్, సౌమ్య, తజ్ముల్ బాష, వేణుగోపాల్ గౌడు, ఎంపీడీవో రాధాకృష్ణ , ఉప తహసిల్దార్ దిలీప్ కుమార్, కో ఆప్షన్ సభ్యుడు భరత్ పాల్గొన్నారు.

ఏపీ రీసెట్ నోటిఫికేషన్ విడుదల

దరఖాస్తుకు మార్చి 19 చివరి గడువు

ప్రజాశక్తి - క్యాంపస్

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని అన్ని యూనివర్సిటీల్లో పీహెచ్.డీ సీట్ల భర్తీకి ఏపీ రీసెట్ 2023 – 24 నోటిఫికేషన్ విడుదల అయ్యింది. ఈ నెల 20 వ తేదీ నుంచీ దరఖాస్తు చేసుకోవచ్చు. దరఖాస్తుకు మార్చి 19 వ తేదీ చివరి గడువుగా విధించారు. ఏప్రిల్ 4 నుంచీ 7 వ తేదీ వరకూ దరఖాస్తులో సవరణలు చేసుకునే వెసులుబాటు ఇచ్చారు. ఏప్రిల్ నెలలోనే ప్రవేశ పరీక్షలు నిర్వహిస్తారు. ఉదయం 9 నుంచీ 11 గంటల వరకూ, మధ్యాహ్నం 2 నుంచీ 4 గంటల వరకూ పరీక్షలు నిర్వహించే అవకాశం ఉంది. సంబంధిత సబ్జెక్టుల్లో 55 శాతం మార్కులు పొందిన వారు ప్రవేశ పరీక్షకు అర్హులు. సమగ్ర సమాచారం కోసం – 9030407022 ఫోన్ లో కానీ, వెబ్ సైట్ నందు కానీ చూడవచ్చు.

విద్యుత్తుశాఖలో నూతన సంస్కరణలు తెచ్చాం: పెద్దిరెడ్డి

ప్రజాశక్తి- పుంగనూరు: రాష్ట్రంలో విద్యుత్ శాఖలో పలు నూతన సంస్కరణలను రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్.జగన్ మోహన్ రెడ్డి అమలు చేస్తున్నారని రాష్ట్ర విద్యుత్, అటవీ, పర్యావరణ, శాస్త్ర సాంకేతిక, భూగర్భ గనులశాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పేర్కొన్నారు. పుంగనూరు మండలంలో విద్యుత్‌శాఖ ద్వారా రూ.14.5 కోట్లతో 33/11 కెవి సబ్‌స్టేషన్లు, సోలార్ పవర్ ప్లాంట్ వంటి పలు అభివృద్ధి కార్యక్రమాలను గురువారం మంత్రి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మంత్రితోపాటు చిత్తూరు ఎంపి ఎన్.రెడ్డెప్ప, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. పుంగనూరులోని కపాడం మిట్టపల్లిలో టిఅండ్‌డి నిధులతో రూ.1.47కోట్లతో ట్రాన్స్ఫార్మర్ రిపైర్ సెంటర్ (విద్యుత్ నియంత్రికల మరమ్మతు కేంద్రం), ఆరడిగుంట, గోపిశెట్టిపల్లిలో పిఎఫ్‌సి నిధులతో ఒక్కొక్కటి రూ.3.22కోట్ల విలువతో రెండు 33/11 కెవి సబ్‌స్టేషన్లు, పుంగనూరు పట్టణంలో సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్ వద్ద రూ.5.90 కోట్లతో 1 మెగా వాట్ సామర్థ్యం గల సోలార్ పవర్ ప్లాంట్‌ను రూ.70 లక్షలతో పుంగనూరు మున్సిపాలిటీ పరిధిలోని 3వ వార్డు నందు శాంతి నగర్‌లోని గృహాల మీదుగా వెళుతున్న 33 కెవి విద్యుత్ లైన్‌ను మార్చడం వంటి పనులను మంత్రి ప్రారంభించారు. ఈసందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలోని అన్ని మున్సిపాలిటీలకు ఆదర్శంగా నిలిచేలా పుంగనూరు పట్టణంలోని సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్ వద్ద 1మెగా వాట్ సామర్థ్యం గల సోలార్ పవర్‌ప్లాంట్‌ను ప్రారంభించడం జరిగిందన్నారు. దీని ద్వారా పుంగనూరు మున్సిపాలిటీకి ఏటా రూ.1.20కోట్లు ఆదా అవుతుందన్నారు. ఈ ప్రాజెక్టు ద్వారా మరో 30సంవత్సరాలు పట్టణానికి సేవలు అందిస్తుందని చెప్పారు. ఇటువంటి ప్రాజెక్టులను మిగిలిన మున్సిపాలిటీలకు విస్తరించే కృషి చేస్తామన్నారు.

మెరుగైన జీవన ప్రమాణలు అందించేందుకే పార్కులు

రూ.80 లక్షలతో నిర్మించిన వైఎస్సార్ తుడా పార్కును ప్రారంభించిన మంత్రి రోజా

ప్రజాశక్తి- నగరి: వినోదంతోపాటు మెరుగైన జీవన ప్రమాణాలు అందించేందుకే పార్కులు నిర్మించినట్లు రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, యువజన సర్వీసుల, క్రీడాశాఖ మంత్రి ఆర్కే రోజా అన్నారు. గురువారం కుశస్థలీ నదిగట్టున ఆహ్లాదకరంగా సిద్ధం చేసిన డాక్టర్ వైఎస్సార్ తుడా పార్కును ఆమె ప్రారంభించారు. పార్కులో ఏర్పాటు చేసిన మహానేత విగ్రహాన్ని ఆవిష్కరించి పూలదండ వేసి నివాళులర్పించారు. చిన్నారుల ఆటల పరికరాలు, వాకింగ్‌కు సిద్ధం చేసిన మెడికేటెడ్ రాళ్ల ట్రాక్, విన్నూత్నంగా నాటిన మొక్కలు, పచ్చదనం ఉట్టిపడే పచ్చిక మైదానాలను స్థానిక నాయకులు, కార్యకర్తలతో కలిసి ఆమె పరిశీలించారు. పార్కులో ఆటలాడుకున్న చిన్నారులతో కాసేపు ముచ్చటించారు. ప్రతిరోజు పార్కులో కాసేపు ఆడుకుంటే ఆనందంతో పాటు ఆరోగ్యం వస్తుందని వారికి సూచించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ నగరి మున్సిపాలిటీ 2005లో ఏర్పడితే ఇప్పటివరకు ఏ నాయకులు పార్కును ఏర్పాటు చేయలేక పోయారన్నారు. ఉద్యోగ, వృత్తి రీత్యా ఒత్తిల్లకు గురైన వారు, వయో వృద్ధాప్యంలో ఆహ్లాదకరమైన ప్రాంతంలో సేదతీరాలనుకున్న వారు, ఉదయం పూట వాకింగ్ చేయదలచినవారు పార్కు కోసం ఎదురు చూస్తారన్నారు. అందుకే రూ.80లక్షల నిధులతో డాక్టర్ వైఎస్సార్ తుడా పార్కును ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. పార్కులు ఆహ్లాదాన్ని పంచడంతో పాటు పట్టణ ప్రమాణాలను పెంచుతుందన్నారు. ప్రస్తుత ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పుత్తూరులో రూ. 1.10కోట్ల వ్యయంతో మున్సిపల్ పార్కు ఏర్పాటు చేయడంతో పాటు రూ.24లక్షల వ్యయంతో చిల్డ్రన్ పార్కుకు ప్రహరీగోడ నిర్మిస్తున్నామన్నారు. రూ.39.5లక్షల వ్యయంతో వడమాలపేటలో తుడాపార్కు ప్రారంభించడం జరిగిందన్నారు. పార్కును నగరి ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. మున్సిపల్ చైర్మన్ పీజీ నీలమేఘం, వైస్‌చైర్మన్లు బాలన్, వెంకటరత్నం రెడ్డి, మున్సిపల్ కమిషనర్ మంజునాథ్ గౌడ్, తుడా డీఈ కృష్ణారెడ్డి, మున్సిపల్ కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

రథసప్తమికి సర్వం సిద్ధం

ప్రజాశక్తి- తిరుమల: తిరుమల శ్రీవారి ఆలయంలో ఫిబ్రవరి 16న శుక్రవారం రథసప్తమి పర్వదినం నిర్వహణకు సర్వం సిద్ధమైంది. శ్రీవారి ఆలయంతోపాటు అన్నప్రసాదం, నిఘా, భద్రత, ఇంజినీరింగ్, ఉద్యానవన తదితర విభాగాలు ఏర్పాట్లు పూర్తిచేశాయి. సప్త వాహనాలపై స్వామివారి వైభవాన్ని తిలకించేందుకు పెద్ద సంఖ్యలో భక్తులు విచ్చేయనుండడంతో అందుకు తగ్గట్టు టీటీడీ ఏర్పాట్లు చేపట్టింది. శ్రీవారి ఆలయంలో తెల్లవారుజామున కైంకర్యాలు పూర్తయిన తరువాత ఉదయం 4.30 గంటలకు శ్రీమలయప్ప స్వామివారు ఆలయం నుండి వాహనమండపానికి వేంచేపు చేస్తారు. అక్కడ విశేష సమర్పణ చేపడతారు. సూర్యప్రభ వాహనం(ఉదయం 5.30 నుండి 8 గంటల వరకు), చిన్నశేషవాహనం(ఉదయం 9 నుండి 10 గంటల వరకు), గరుడ వాహనం(ఉదయం 11 నుండి 12 గంటల వరకు), హనుమంత వాహనం(మధ్యాహ్నం 1 నుండి 2 గంటల వరకు), చక్రస్నానం (మధ్యాహ్నం 2 నుండి 3 గంటల వరకు), కల్పవృక్ష వాహనం(సాయంత్రం 4 నుండి 5 గంటల వరకు), సర్వభూపాల వాహనం(సాయంత్రం 6 నుండి రాత్రి 7 గంటల వరకు) చంద్రప్రభ వాహనం(రాత్రి 8 నుండి 9 గంటల వరకు) సేవలు ఉంటాయి.

చెప్పులకు లాక్

తిరుమలలో భక్తుడి ధోరణి

ప్రజాశక్తి- తిరుమల: ఈ వింత తిరుమలలో చూపరులని నవ్విస్తుంది. సైకిళ్లకు, స్కూటర్లకు, మోటార్ సైకిళ్లకు తాళాలు వేసేవాళ్లను మనం చూశాం కానీ తిరుమలలో ఓ భక్తుడు తన పాదరక్షల ఆశ్రయం కోసం దాన్ని స్టాండ్‌కి లాక్కెళ్లడం చూశాం. తిరుమలలోని నాలుగు మాడ వీధుల్లో పాదరక్షలు ధరించడాన్ని నిషేధించింది. యాత్రికుల సౌకర్యార్థం మాడ వీధుల్లో భక్తులు పాదరక్షలు ఉంచేందుకు టీటీడీ పలు చోట్ల స్టాండ్‌లను ఏర్పాటు చేసింది. అయితే అక్కడ స్టాండ్‌లోని పాదరక్షలు తప్పిపోయిన సందర్భాలు, భక్తులు నిరాదరణకు గురవుతున్నారు. ఒక భక్తుడు తన చప్పల్‌ను సురక్షితంగా ఉంచుకోవడానికి తాళాన్ని ఉపయోగించడం మంచిదని భావించాడు. రామ్ బాగీచా రెస్ట్ హౌస్ స్టాండ్ దగ్గర, చాలా మంది యాత్రికులు ఆశ్చర్యం నవ్వుతున్నారు.

పదేళ్ల కిందట ఎకరా పొలంలో వరి పండించేందుకయ్యే ఖర్చు రూ.10 వేలు. ఇప్పుడు రూ.35 వేలకు చేరుకుంది. అయితే 75 కిలోల ధాన్యం బస్తాకు మిల్లర్లు చెల్లిస్తున్న ధర మాత్రం రూ.1700 లోపే. ఒక్కో ఎకరాకు 30 బస్తాల దిగుబడి వేసుకున్నా వచ్చే ఆదాయంలో రైతులకు మిగిలేది అరకొరే. అదే 75 కిలోల బియ్యం బస్తా మార్కెట్లో కొనుగోలు చేస్తే మాత్రం రూ.4,500 పైనే ధర పలుకుతోంది.

కుప్పం నియోజకవర్గంలో పూలు, కూరగాయలు సాగవుతాయి. అయితే పొలంలో కూరగాయలు కిలో 10-15 ధర పలుకుతుంటే, తిరుపతి మార్కెట్లో మాత్రం ముట్టుకుంటే పేలిపోయేలా కిలో రూ.50-60 ఉంది. కూరగాయల సాగుకు పెట్టిన పెట్టుబడులు కూడా రావడం లేదని కొంతమంది సాగుచేయడమే మానుకున్నారు. అంతేకాదు సాగుకు రసాయన ఎరువులు వాడివాడి పంటలు వేయకుండా 'క్రాప్ హాలిడే' ప్రకటించారు.

'గిట్టుబాటు' కాని వ్యవ'సాయం'

దళారులు నిర్ణయించిందే ధర! / కానరాని ధాన్యం కొనుగోలు కేంద్రాలు / నేటి 'గ్రామీణ బంద్'లో అన్నదాత

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి

ఏటేటా వరి సాగు అన్నదాతల పాలిట ఉరితాళ్లవుతున్నాయి.. రైతే రాజు..దేశానికి పట్టెడన్నం పెట్టేది రైతన్నేనంటూ గొప్పలు చెప్పడమే తప్ప కనీస మద్దతు ధర(ఎంఎస్‌పీ) ప్రకటించే కనీస ఆలోచన కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చేయడం లేదు. ఫలితంగా అన్నదాత ఆరుగాలం శ్రమ అప్పుల పాలవుతోంది. ధాన్యానికి గిట్టుబాటు ధర లేక దళారుల చేతుల్లో రైతు దగా పడాల్సి వస్తోంది. వర్షాభావ పరిస్థితులను, ప్రకృతి విపత్తులను తట్టుకుని..కష్టాన్నే నమ్ముకుని పండించిన ధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు సరైన సమయంలో కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడంతో రైతన్నకు ఈ పరిస్థితి దాపురిస్తోంది. పంటలకు కనీస మద్దతు ధర ప్రకటించాలనీ, నల్ల వ్యవసాయ చట్టాలను రద్దు చేయాలని 2022లో ఢిల్లీలో రైతులు ఏడాది పాటు పోరాటం చేశారు. ఆ పోరాటంలో వందలాది మంది అన్నదాతలు అశువులు బాశారు. అయినా పాలకుల్లో ఎలాంటి కనికరం లేదు. అన్నదాతల పట్ల అదే నిర్లక్ష్యం..అదే నిర్లిప్తత. దీంతో అన్నదాత మరోసారి ఢిల్లీ వైపుగా పోరాట బాటపట్టాడు. వారికి మద్దతుగా దేశ వ్యాప్తంగా కార్మికులు, కర్షకులు శుక్రవారం గ్రామీణబంద్‌లో పాల్గొంటుండటం విశేషం.

- **కానరాని కొనుగోలు కేంద్రాలు**

రైతుకు అండగా నిలబడేందుకు 2014లో అప్పటి టీడీపీ ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించింది. చంద్రబాబు హయాంలో ధాన్యం కొనుగోలు బాధ్యతను వెలుగు పథకం(డ్వాక్రా) ద్వారా నిర్వహించారు. 2019లో వైసీపీ ప్రభుత్వం అధికారాన్ని చేపట్టాక ధాన్యం కొనుగోళ్లను సహకార పరపతి సంఘాలతో పాటు వ్యవసాయ మార్కెట్లకు అప్పజెప్పింది. తర్వాత రైతు భరోసా కేంద్రాలు వచ్చిన తర్వాత అధిక శాతం వాటి నుంచే కొనుగోళ్లు చేసింది. అయితే తూర్పు మండలాల్లో ఈ సారి వర్షాలు సమృద్ధిగా పడటంతో రైతులు నవంబర్‌లోనే వరి సాగు మొదలు పెట్టారు. అవి ఇప్పుడు కోతకు వచ్చాయి. అయితే రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటి వరకు ధాన్యానికి మద్దతు(ఎంఎస్‌పీ) ధర ప్రకటించి ధాన్యం కొనుగోళ్ల కేంద్రాలను ఏర్పాటు చేయలేదు.

- **దళారులు నిర్ణయించిందే ధర!**

ఏటా పెట్టుబడి, కూలీలు, ఎరువుల ఖర్చులు పెరుగుతున్నాయే తప్ప రైతు పండించిన ధాన్యానికి మాత్రం గిట్టుబాటు ధర మాత్రం పెరగడం లేదు. పదేళ్ల కిందట ఎకరా పొలంలో వరిని పండించేందుకయ్యే ఖర్చు రూ.10 వేలు కాగా ఇప్పుడు రూ.35 వేలకు చేరుకుంది. అయితే 75 కిలోల ధాన్యం బస్తాకు చెల్లిస్తున్న గిట్టుబాటు ధర మాత్రం రూ.1700 లోపే ఉంటోంది. గతేడాది గ్రేడ్-1 పరిధిలోకి వచ్చే వరి రకాలకు రూ.1727, సాధారణ రకాలకు రూ.1512 చెల్లిస్తానని చెప్పింది. అయితే మిల్లర్లు, దళారీలు సిండికేట్‌గా ఏర్పడి రైతులకు చెల్లిస్తున్న ధర మాత్రం రూ.1400 నుంచి రూ.1550 వరకు ఉంటోంది. ఈ ఏడాది జనవరిలో గ్రేడ్-1 వరి రకం 80 కిలోలకు రూ.2500 మద్దతు ధర పలికింది. ప్రస్తుతం వరి కోతలు ఊపందుకోవడంతో దళారీలు సిండికేట్‌గా ఏర్పడి మద్దతు ధరను ఏకంగా రూ.2100కు తగ్గించేశారు. ఈ నేపథ్యంలో గిట్టుబాటు ధర లేక పోయినా వేరే దారి లేక దళారులు నిర్ణయించిన ధరకే ధాన్యాన్ని అమ్ముకోవాల్సి వస్తోంది.

- **త్వరలోనే ఏర్పాటు చేస్తాం: రమేష్‌బాబు, ఏడీఏ, శ్రీకాళహస్తి**

రైతుల నుంచి ధాన్యం కొనుగోళ్లు చేసేందుకు ప్రభుత్వం నుంచి ఇంకా అనుమతి రాలేదు. తూర్పు మండలాల్లో ఎక్కువ మంది డిసెంబరు, జనవరి నెలల్లో మాత్రమే వరి నాట్లు వేస్తారు. అవి మార్చి, ఏప్రిల్, మే నెలల్లో కోతకు వస్తాయి. ఈ ఏడాది మార్చి నెలలో ధాన్యం కొనుగోళ్లకు ప్రభుత్వం నుంచి అనుమతి వచ్చే అవకాశం ఉంది. మద్దతు ధర కూడా రైతులకు గిట్టుబాటయ్యే అవకాశాలే అధికంగా ఉంటాయి. రైతులు దిగులు పడాల్సిన అవసరం లేదు.

అప్పులే మిగులుతున్నాయి: రవి, రైతు, బోనుపల్లి గ్రామం

ఏడాదికి రెండు సార్లు ధాన్యాన్ని పండించినా అప్పులే తప్ప లాభం రావడం లేదు. రైతుల నుంచి ప్రభుత్వంధాన్యాన్ని కొనుగోలు చేస్తుందని చాలా మందికి తెలియదు. తెలిసే లోపే అప్పులు గుర్తొచ్చి దళారులు ఇచ్చిన రేటుకే ధాన్యాన్ని అమ్మేసుకుంటున్నాం. విత్తనాలు, ఎరువులు, కూలీలు కలిపి పెట్టుబడి ధర వేలల్లో పెరిగింది. కానీ ధాన్యానికి మాత్రం ఏటా వందే పెరుగుతోంది. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ధాన్యానికి కనీస మద్దతు ధర ప్రకటించి రైతులను ఆదుకోవాలి.

తిరుపతిలో తాగునీటి ఎద్దడి

వేసవి ముందస్తు జాగ్రత్తలు ఏవి..?

మూడురోజులకు ఒకసారి సరఫరా

ప్రత్యామ్నాయంగా ట్యాంకర్లతో పంపణి

ప్రజాశక్తి-తిరుపతి టౌన్

తిరుపతి ఆధ్మాతిక నగరంలో నీటి సమస్యతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. అయితే కౌన్సిల్లో తాగునీటి సమస్యపై ముందస్తు చర్చించి వేసవి జాగ్రత్తలు తీసుకోకపోవడం గమనార్హం. గతంలో రోజుమార్చి రోజు తాగునీటిని వదిలేవారు. తాజాగా మూడు రోజులకోసారి వదులుతున్నారు. కొన్ని డివిజన్లలో అరగంట, మరికొన్ని డివిజన్లలో 45 నిమిషాలు సరఫరా చేస్తున్నారు. యూనివర్సిటీలు, ఆస్పత్రులకు మీటర్లు పెట్టి సరఫరా చేస్తున్నారు. నగరంలో మూడు లక్షల జనాభా ఉంది. తిరుపతికి రోజుకు 80వేల మంది యాత్రికులు రాకపోకలు సాగిస్తుంటారు. ప్రధాన నీటి వనరులు తెలుగుగంగ. శ్రీకాళహస్తి కైలాసగిరి రిజర్వాయర్ నుంచి రామాపురం రిజర్వాయర్ ద్వారా దాదాపు 37 కిలోమీటర్ల పైప్‌లైన్ ద్వారా నీటి సరఫరా జరుగుతుంది. నగరంలో 12 ఫిల్టర్ ట్యాంకులు ఉన్నాయి. అమృత్ పథకంలో నిర్మించిన 11 ట్యాంకులున్నాయి. తెలుగుగంగతో పాటు చంద్రగిరి నియోజకవర్గంలో కల్యాణిడ్యాం ద్వారా నీటి సరఫరా చేస్తున్నారు .రామాపురం రిజర్వాయర్ వద్ద విద్యుత్ సమస్య వస్తే తెలుగుగంగ నీటి సరఫరా సమస్య ఏర్పడుతుంది. వేసవిలో ముందస్తు చర్యలు తీసుకోకపోవడం వల్లే ఈ సమస్యలు వస్తున్నట్లు నగర వాసులు మండిపడుతున్నారు.

3 ఎంఎల్‌డిలు కొరత

రోజుకు 65 ఎంఎల్‌డిల డిమాండ్ ఉంది. తెలుగుగంగ ద్వారా 44 ఎంఎల్‌డిలు, కల్యాణిడ్యాం ద్వారా 20 ఎంఎల్‌డిలు, 534 చేతిబోర్ల ద్వారా 1.47 ఎంఎల్‌డిల నీటిని అందిస్తున్నారు. మొత్తం 62 ఎంఎల్‌డిలు నీటిని సరఫరా చేస్తున్నారు. 3 ఎంఎల్‌డిల కొరత ఉంది. నీటి సమస్య ఉన్న డివిజన్‌లలో రోజుకు 16 నీటి ట్యాంకర్ల ద్వారా 0.75 ఎంఎల్‌డిల నీటిని సరఫరా చేస్తున్నారు. అమృత్ పథకంలో కొన్ని ట్యాంకుల నిర్మాణం ఇంకా పూర్తి కావాల్సి ఉంది. మురికివాడ ప్రాంతాల్లో నీటి సమస్య జఠిలంగా ఉంది. ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేస్తున్నా అరకొరగానే సరిపోతున్నాయని మహిళలు వాపోతున్నారు. మధ్యాహ్నం పూట ట్యాంకర్లను తీసుకురావడం వల్ల అప్పటికే కొంతమంది ఉద్యోగాలకు వెళ్లిపోవడం, షాపుల్లో పనులకు వెళ్లిపోవడం జరుగుతుంది. దీంతో ఆయా ఇళ్లల్లో తాగునీటి కొరత తప్పనిసరి. ఇక అపార్టుమెంట్‌వాసులు, వ్యాపార సముదాయం కలిగినవారు రూ.వెయ్యి నుంచి 5వేలు తక్కువ లేకుండా చెల్లించి నీటిని తెప్పించుకుంటున్నారు.

స్కాడ్కా సెంటర్ గాలికి..!

తిరుపతి అలిపిరి ఫిల్టర్ సెంటర్ వద్ద ఏర్పాటు చేసిన స్కాడ్కా సెంటర్‌ను మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు గాలికొదిలేశారు. స్కాడ్కా వల్ల ఎక్కడ తాగునీటి పైపులైన్ లీకేజికి గురవుతుందో కమాండ్ కంట్రోల్ ద్వారా పరిశీలించి లీకేజీలను మరమ్మతు చేసేవారు. అయితే ఇందుకు సంబంధించిన అగ్రిమెంట్‌ను మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు రెన్యువల్ చేసుకోలేదు.

నీటి సమస్య లేకుండ చర్యలు : మోహన్, మున్సిపల్ కార్పొరేషన్ ఎస్ఇ

వేసవిలో తాగునీటి సమస్య లేకుండ చర్యలు తీసుకుంటాం. రామాపురం వద్ద గాలి వానకు విద్యుత్ సరఫరా సమస్య వచ్చి తెలుగుగంగనీటికి అంతరాయం కలిగింది. విద్యుత్ సమస్య ఏర్పడకుండ ఉండేందుకు ఎస్‌పిడిసిఎల్ అధికార్లతో సంప్రదించాం.

ఉద్యోగ,ఉపాధ్యాయ సమస్యలపై పోరాటం తీవ్రతరం

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ల సమస్యలపై పోరాటాన్ని తీవ్రతరం చేయనున్నట్లు ఏపీ జేఏసీ చిత్తూరు జిల్లా సమావేశం తీర్మానించింది. గురువారం స్థానిక ఎన్జీవో హోంలో ఏపీ జేఏసీ జిల్లా సమావేశం నిర్వహించారు. ఈసమావేశంలో 30 మంది ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల నాయకులు పాల్గొన్నారు. ఏపీ జెఎసి రాష్ట్ర కమిటీ నిర్దేశించిన ఉద్యోగ, ఉపాధ్యాయ సమస్యలపై చర్చించారు. ఉద్యోగ ఉపాధ్యాయ పెన్షనర్ల సమస్యలపై ప్రభుత్వం సానుకూలంగా స్పందించాలని జిల్లా జేఏసీ నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ఏపీ జెఎసి జిల్లా అధ్యక్షులు కేవీ రాఘవులు, నాయకులు పాల్గొన్నారు.

ఓట్ల పరిశీలన సక్రమంగా చేపట్టాలి..!

ప్రజాశక్తి - రామకుప్పం: బిఎల్వోలు, క్లస్టర్ ఇంచార్జిలు, యూనిట్ ఇన్చార్జిలు సమన్వయంతో ఓటర్ల పరిశీలన సక్రమంగా చేపట్టాలని, అర్హత కలిగిన ప్రతి ఒక్క ఓటర్లను పరిశీలన చేయాలని టిడిపి మండల అధ్యక్షుడు ఆనందరెడ్డి, రాష్ట్ర ఎస్సీ సెల్ ఉపాధ్యక్షుడు మునస్వామి కోరారు. గురువారం సుబ్రహ్మణ్య స్వామి ఆలయ ఆవరణలో ఓటర్ల జాబితాను పరిశీలించారు. చేర్పులు, మార్పులు, మృతి చెందిన ఓటర్లను తొలగించి, రెండుసార్లు నమోదైన ఓటర్లను తొలగించాలన్నారు. పత్రా నారాయణ, నాగభూషణం, మనోహర్, రఫీ, రామ్మూర్తి, సుబ్రి, బాలు, శ్రీనివాసులు, సతీష్, అవినాష్ పాల్గొన్నారు.

మురుగునీటి కాలువలు శుభ్రం

ప్రజాశక్తి- బైరెడ్డిపల్లి: మండలంలోని జంగాల అగ్రహారం గ్రామపరిధిలోని మురుగునీటి కాలువలు వ్యర్థాలు పేరుకుపోయి మురుగు రోడ్లపై ప్రవహించడంతోపాటు దోమలు వృద్ధి చెందుతున్నాయి. అంతేకాకుండా కాలువల నుంచి వచ్చే దుర్వాసనతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. సమస్యను గురించి తెలుసుకున్న పంచాయతీ కార్యదర్శి సదాశివయ్య, సర్పంచ్ విజయప్రకాష్ గురువారం గ్రీన్ అంబాసిడర్స్ ద్వారా మురుగునీటి కాలువలను శుభ్రం చేయించారు.

ఓటర్ల వివరాలు క్షుణ్ణంగా పరిశీలించాలి..

ప్రజాశక్తి- బంగారుపాళ్యం: రాబోవు సార్వత్రిక ఎన్నికల కోసం ఎన్నికల ఓటర్ల నమోదు ప్రక్రియలో అధికారులు బిజీబిజీ అయ్యారు. గురువారం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో తహశీల్దార్ సుభద్రమ్మ, డిప్యూటీ తహశీల్దార్ అనిల్ కుమార్, బిఎల్ఓలతో గ్రామాల్లో దరఖాస్తు చేసుకున్న ఓటర్ల వివరాలు క్షుణ్ణంగా పరిశీలించి, ఓటర్ల నమోదు ప్రక్రియను చేపట్టారు. రాజకీయ నాయకులు ఒత్తులకు లొంగకుండా ఓట్ల నమోద ప్రక్రియలో ఎన్నికల అధికారి ఇచ్చిన ఆదేశాల మేరకు విధులు చేపడుతున్నట్టు తెలిపారు. తహశీల్దార్ కార్యాలయం సిబ్బంది. బిఎల్వోలు తదితరులు పాల్గొన్నారు.

అన్నదానం

ప్రజాశక్తి- పుంగనూరు: బంజారాల ఆరాధ్య దైవం శ్రీసంత్ సేవాలాల్ మహారాజ్ 285 జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. గురువారం పట్టణంలోని ఎన్టీఆర్ సర్కిల్, అంబేద్కర్ సర్కిల్ వరకు గురువారం భారీ ర్యాలీ నిర్వహించారు. బంజారా నాయకులు మాట్లాడుతూ బంజారా ఆరాధ్య దైవం జయంతి ఫిబ్రవరి 15 ప్రతి ఏడాది జరుపుకుంటున్నట్లు చెప్పారు. పుంగనూరు పట్టణంలో సేవలాల్ మహారాజ్ చిత్రపటానికి పూజలు నిర్వహించి పాలాభిషేకం చేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. అడహాక్ కమిటీ అధ్యక్షులు మూడే ఈశ్వర్ నాయక్, ప్రధాన కార్యదర్శి మూడే రెడ్డినాయక్, కోశాధికారి బాణావత్ రాజు నాయక్, కమిటీ సభ్యులు తదితరులుపాల్గొన్నారు.

సచివాలయ ఉద్యోగిపై దాడి

ఆలస్యంగా వెలుగు చేసిన ఘటన

ప్రజాశక్తి- చిత్తూరు డెస్క్: ఎస్ఆర్ పురం మండల కేంద్రం సచివాలయంలో ఇంజనీరింగ్ అసిస్టెంట్ శశి కుమార్‌పై దాడి చేసిన సంఘటన మండలంలో చోటుచేసుకుంది. ఈ సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. సచివాలయం ఇంజనీరింగ్ అసిస్టెంట్ శశికుమార్ మాట్లాడుతూ మంగళవారం సాయంత్రం విధులు నిర్వహిస్తున్న తనను హౌసింగ్ బిల్లు విషయంపై ఓ ప్రభుత్వ ఉపాధ్యాయుడు దాడి చేశారన్నారని తెలిపారు. ఇంజనీరింగ్ అసిస్టెంట్ సచివాలయ ఉద్యోగిపై దాడి చేసిన వ్యక్తులపై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసిన ఇంతవరకు స్పందించకపోవడం దారుణమని ఆవేదన వ్యక్తం చేశారు. సంబంధిత వ్యక్తులపై ఎందుకు కేసు నమోదు చేయడం లేదని, పోలీసులు కేసును నీరు కార్చే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. ఈఘటనపై సంబంధిత అధికారులు స్పందించి చర్యలు చేపట్టాలని, తనకు న్యాయం చేయాలని కోరారు.

'విజయానందరెడ్డిని గెలిపించుకుందాం'

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: స్థానిక శంకరయ్యగుంట అంబేద్కర్‌నగర్‌కు చెందిన తెలుగుదేశం పార్టీ నాయకురాలు కళ తనవర్గం ప్రజలతో పాటు విజయానందరెడ్డి ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. వారికి విజయానందరెడ్డి కండువాలు వేసి పార్టీలో సాదరంగా ఆహ్వానించారు. వారు మాట్లాడుతూ రాష్ట్రంలో జగనన్న చేపట్టిన సంక్షేమ పథకాలకు, నగరం, శంకరయ్య గుంటలోనూ విజయానందరెడ్డి తన సొంత నిధులతో చేపట్టిన అభివృద్ధికి ఆకర్షితులై పార్టీలో చేరుతున్నట్టు ఆమె తెలిపారు.

ఆత్మీయ సమావేశానికి సర్వం సిద్ధం

చిత్తూరు వైసిపి అభ్యర్థి విజయానందరెడ్డిని అఖండ మెజారిటీతో గెలిపించేదమే ప్రధాన అంశంగా ఈనెల 25వ తేదీ నిర్వహించనున్న ముదలియార్ సంఘ ఆత్మీయ సమావేశం కార్యక్రమాన్ని దిగ్విజయం చేయాలని ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సిఎన్.రాజశేఖర్ ముదలియార్ పిలుపునిచ్చారు. గురువారం మొదలియార్ సంఘ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన అన్ని సంక్షేమ పథకాలలోనూ ముదలియార్ కులస్తులు పెద్దసంఖ్యలో సంక్షేమ ఫలాలు అందుకుంటున్నారని తెలిపారు. చిత్తూరులో ఎమ్మెల్యే అభ్యర్థి విజయానందరెడ్డికి ముదలియార్ కులస్తులు అండగా నిలబడతామని తెలిపారు. అలాగే ఆత్మీయ సమావేశాన్ని అందరూ జయప్రదం చేయాలని కోరారు. ఏజీ బాలాజీ, సహదేవన్, వాసు దేవన్, రాంగణేష్, తిరుకుమరన్, నవీన్ కుమార్ పాల్గొన్నారు.

మంత్రి చొరవతో రోడ్డు పనులు ప్రారంభం

ప్రజాశక్తి - గంగాధరనెల్లూరు: డిప్యూటీ సిఎం నారాయణస్వామి చొరవతో గంగాధర నెల్లూరు గంగమ్మ గుడి నుంచి పెనుమూరు మండలం సరిహద్దు వరకు గుంతల రోడ్డుకు మోక్షం లభించిందని గ్రీనింగ్, బ్యూటిఫికేషన్ డైరెక్టర్ గుణశేఖర్ రెడ్డి, జిల్లా మామిడి రైతు అధ్యక్షులు వెంకటరెడ్డి, మాజీ ఏఎంసీ చైర్మన్ చిన్నమ్మ రెడ్డి, సీనియర్ నేత రూపకుమార్ రెడ్డిలు తెలిపారు. మండలంలోని అక్కనగారిపల్లి గ్రామం చెరువుకట్ట వద్ద రోడ్డు విస్తరణ పనులకు గాను గురువారం శంకుస్థాపన పూజచేసి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిర్ణీత సమయంలోనే పనులు పూర్తి చేసి గ్రామాల ప్రజలకు గతుకుల రోడ్డు నుండి మోక్షం కలిగించాలని డిప్యూటి సిఎం అధికారులను ఆదేశించినట్లు తెలిపారు. 4.01 కోట్ల రూపాయలు ఖర్చుతో 7.6 కిలోమీటర్ల రోడ్డు విస్తరణ పనులు చేపట్టినట్లు తెలిపారు. డిప్యూటీ సీఎం పీఏ ఆనంద్ రెడ్డి, ఏఈ సుధాకర్ రెడ్డి, ఎంపీపీ హరిబాబు, సర్పంచుల సంఘం అధ్యక్షులు ఏకాంబరం, గంగాధరనెల్లూరు సర్పంచ్ సుబ్రమణ్యం, జైన్‌ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షులు సుబ్రమణ్యంరెడ్డి పాల్గొన్నారు.

నిర్మాణ పనులకు పూజచేసి పాల్గొన్న డిప్యూటీ సీఎం పీఏ

ఇళ్ల స్థలాలను కబ్జా చేసిన వైసిపి కార్యకర్త

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: 1987లో అప్పటి ఎమ్మెల్యే ఆర్.గాంధీ పూతలపట్టు మండలం అయ్యప్పగారిపల్లెలో ఇంటి స్థలంలేని 28 మంది దళితులకు మూడు సెంట్లు భూమిని కేటాయించి ఉన్నారు. అయితే ప్రస్తుతం అదే గ్రామానికి చెందిన పూజారి దామోదరం వైసిపి కార్యకర్త దౌర్జన్యం చేస్తూ ఆ ఇంటి స్థలాను కబ్జాకు ప్రయత్నిస్తున్నారని బాధిత దళితులు వాపోతున్నారు. గురువారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బాధితులు మాట్లాడుతూ ఇంటి స్థలం లేని తమకు 1987 సంవత్సరంలో మూడు సెంట్లు చొప్పున 28 మందికి భూమిని కేటాయించారని, అయితే ఇటీవల ఇల్లు కట్టుకోవడానికి ప్రయత్నిస్తే తమపై దామోదరం దౌర్జన్యం చేస్తున్నారని, అడ్డుకోబోయిన మహిళలపై అనుచితంగా ప్రవర్తించాడని వాపోయారు. బుధవారం రాత్రి కబ్జాను అడ్డుకునేందుకు ప్రయత్నించిన మహిళలపై దాడి చేశాడని తెలిపారు. తమకు జరుగుతున్న అన్యాయంపై స్థానిక పోలీస్‌స్టేషన్, రెవెన్యూ అధికారుల దృష్టికి తీసుకుపోయినా పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీ జోక్యం చేసుకుని తమకు న్యాయం చేయాలని వారు కోరారు.

మాజీ మంత్రి కుతూహలమ్మకు నివాళి

ప్రజాశక్తి- గంగాధర నెల్లూరు: మాజీ మంత్రి గుమ్మడి కుతూహలమ్మ ఏడాది క్రితం మరణించిన విషయం తెలిసిందే. గురువారంమండలంలోని వి.లక్ష్మిరెడ్డిపల్లి దళితవాడకు సమీపంలో కుతూహలమ్మ ప్రథమ వర్ధంతి సందర్భంగా ఆమె సమాధి వద్ద వారి కుటుంబ సభ్యులతో పాటు వివిధ పార్టీలకు చెందిన రాజకీయ నేతలు గురువారం నివాళులర్పించారు. కుతూహలమ్మ కుటుంబ సభ్యులు మునిసిద్ధయ్య, ఆనగంటి హరిక్రిష్ణ, భానుమతి, వెంకటస్వామి, నేతలు వేల్కూరు బాబురెడ్డి, ఎన్‌బి.సుధాకర్‌రెడ్డి, బాలచంద్రారెడ్డి, దేవరాజులు పాల్గొన్నారు.

మాజీ మంత్రి కుతూహలమ్మ సమాధి వద్ద నివాళులర్పిస్తున్న హరికృష్ణ

అధికారంలోకి వచ్చిన వెంటనే

మెగా డీఎస్సీ ఏర్పాటు చేస్తాం

ఎమ్మెల్యే అభ్యర్థి థామస్



ప్రజాశక్తి- వెదురుకుప్పం: వైసీపీ ప్రభుత్వం గత ఎన్నికల సమయంలో జగన్మోహన్ రెడ్డి మెగా డీఎస్సీ ద్వారా 23వేల టీచర్ పోస్టులు భర్తీ చేస్తామని హామీ ఇచ్చి, ప్రస్తుతం 6వేల డీఎస్సీ నోటిఫికేషన్ ఇచ్చి యువతను మోసం చేసిందని డీఎస్సీ నిరుద్యోగులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా గురువారం నియోజకవర్గ టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ థామస్‌కు వినతిపత్రం అందించారు. టిడిపికి అండగా ఉంటామని, టిడిపి అధికారంలోకి వచ్చిన వెంటనే మెగా డీఎస్సీ ఏర్పాటు చేయాలని కోరారు. దీనిపై స్పందించిన థామస్ రానున్న ఎన్నికల్లో తెలుగుదేశంపార్టీ ప్రభుత్వం వచ్చిన వెంటనే తప్పకుండా మెగా డీఎస్సీ ఏర్పాటు చేసి నిరుద్యోగ యువతను ఆదుకుంటామని భరోసా ఇచ్చారు.

క్రైం న్యూస్

కర్ణాటక మద్యం స్వాధీనం

నలుగురు అరెస్టు

ప్రజాశక్తి- గంగవరం: మండలంలోని బెంగుళూరు- చెన్నై రహదారి కుక్కలదొడ్డి క్రాస్ వద్ద గురువారం గంగవరం ఎస్సై ప్రతాపరెడ్డి వాహనాల తనిఖీ చేపట్టారు. ఈసందర్భంగా ద్విచక్ర వాహనంలో కర్ణాటక నుండి అక్రమంగా మద్యం తరలిస్తున్న వ్యక్తిని అదుపులోకి తీసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు. ఈ మద్యం విలువ రూ.40వేలు ఉంటుందన్నారు. సదర వ్యక్తి బైరెడ్డిపల్లి మండలం చప్పిడిపల్లి గ్రామానికి చెందిన రాజగోపాల్ కుమారుడు శరవన్ కుమార్‌గా గుర్తించి అతన్ని అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసి రిమాండ్ పంపినట్లు తెలిపారు. అలాగే బుధవారం రాత్రి గంజాయిని సరఫరా చేస్తున్న ముగ్గురు వ్యక్తులను కూడా అరెస్టు చేసినట్లు తెలిపారు. వీరిలో గంగవరం చెందిన జిలాని, కేజీ సత్రానికి చెందిన కుమార్, పెద్దపంజానికి చెందిన శేఖర్‌ను అదుపులోకి తీసుకొని వారి వద్ద నుండి రూ.10వేలు విలువ గల గంజాయి, మూడు కేజీల ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. వీరిపై కూడా కేసు నమోదు చేసి రిమాండ్ తరలించినట్లు పేర్కొన్నారు.

పెద్దపంజాణి: మండలంలో కర్ణాటక నుంచి అక్రమంగా తరలిస్తున్న కర్ణాటక మధ్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు పలమనేరు డిఎస్పి మహేశ్వర్ రెడ్డి తెలిపారు. గురువారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో కర్ణాటక మద్యంతో పాటు ముగ్గురిని అరెస్ట్ చేసినట్లు తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాలు మేరకు డీఎస్పీ ఆదేశాలు మేరకు పలమనేర్ రూరల్ సర్కిల్ ఇన్స్పెక్టర్ కృష్ణమోహన్ పర్యవేక్షణలో పంజాణి పోలీస్‌స్టేషన్ సబ్ ఇన్స్పెక్టర్ శ్రీనివాసులు వారి సిబ్బంది గురువారం ముల్బాగల్- పుంగనూరు రోడ్డులోని రాజుపల్లి చెక్‌పోస్ట్ వద్ద పోలీసులు తనిఖీలు చేపట్టారు. సంపల్లికి చెందిన సద్దాం హుస్సేన్, మంజునాథ్, జగదీష్ అప్పి ఆటోలో అక్రమ రవాణా చేస్తున్న కర్ణాటక మద్యం (ఒరిజినల్ ఛాయిస్ డీలక్స్ విస్కీ 23,టెట్రా ప్యాకెట్లు 96, మొత్తం 2208 టెట్రా పాకెట్స్) ఉన్నట్లు గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. తనిఖీలు నిర్వహిస్తున్న సమయంలో కొంత మంది పారిపోగా సద్దాం హుస్సేన్, మంజునాథ్, జగదీశ్‌ను అదుపులోకి తీసుకుని వారి నుంచి మద్యంతోపాటు ఆటోను స్వాఈనం చేసుకున్నారు. సద్దాంపై జిల్లాలోని పలు పోలీసు స్టేషన్‌లో కేసు ఉన్నాయని తెలిపారు. అనంతరం వీరిపై కేసు నమోదు చేసి రిమాండ్ తరలించినట్లు తెలిపారు. ఎవరైనా కర్ణాటక మద్యం అక్రమ రవాణాకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని పలమనేర్ రూరల్ సర్కిల్ ఇన్స్పెక్టర్ హెచ్చరించారు. ఈ మద్యాన్ని పట్టుకున్న పంజాని పోలీస్‌స్టేషన్ ఎస్ఐ, సిబ్బందిని, పలమనేరు డిఎస్పి అభినందించారు.

లారీ ఢీకొని వ్యక్తి దుర్మరణం

ప్రజాశక్తి- వికోట: మండల పరిధిలోని గంగాధరుమాకులపల్లి వద్ద జాతీయ రహదారిపై గురువారం సాయంత్రం రోడ్డు దాటుతున్న ఓ వ్యక్తిని లారీ ఢీకొన్న సంఘటనలో ఆ వ్యక్తి దుర్మరణం చెందాడు. స్థానికుల కథనం మేరకు వివరాలు. కుప్పం వైపు నుండి వీకోటకు వెళుతున్న లారీ గందారు మాకులపల్లి సమీపంలో రోడ్డు దాటుతున్న నారాయణప్పను ఢీకొంది. ఈ ప్రమాదంలో నారాయణప్ప తీవ్రంగా గాయపడడంతో 108 వాహనంలో చికిత్స నిమిత్తం కుప్పం మెడికల్ కళాశాలకు తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందినట్లు తెలిపారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మృతుల కుటుంబాలకు ఆర్థిక సాయం

ప్రజాశక్తి - రామకుప్పం: మండలంలోని ముద్దనపల్లి గ్రామానికి చెందిన నారాయణస్వామి, రామకృష్ణప్ప, జమ్మున్ అనే టీడీపీ కార్యకర్తలు అనారోగ్యంతో మృతి చెందారు. టిడిపి నేతలు, కార్యకర్తలు గురువారం వారి భౌతిక కాయలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం తెలుగుదేశం పార్టీ తరపున రూ.10వేలు చొప్పున మృతుల కుటుంబాలకు ఆర్థిక సాయం అందించారు. ఆనంద రెడ్డి, మునస్వామి, జయశంకర్, భాస్కరాచారి, గజేంద్ర, రామ్మూర్తి, నాగభూషణం, వెంకటరమణ, వెంకటేష్ పాల్గొన్నారు.